
# సినీ బేతాళ కథలు

## - డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 35 -

### - తూతూబాకా -

**విక్రమార్కుడు,** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

"- విక్రా! నీ వాకింగు నీకు టైరింగు అనిపించకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను-" అని బేతాళుడు ప్రారంభించాడు.

- చిత్రలోలుడు, విచిత్రకాముడు అనే సోదర నిర్మాతలు అనేక అప్‌టుడేట్ తెలుగు చిత్రాలు తీస్తూ బూతుబ్రదర్స్‌గా ఖ్యాతి గడించారు. తీసే చిత్రాల్లో రాసే డైలాగులు వర్తమాన తెలుగుదనంతో తెరంతా తచ్చాడుతూ ఆ చిత్రాలు సెన్సారువారి కత్తెర పడకుండా రిలీజయి, తెలుగువారి కుటుంబ చిత్రాలుగా ఘనవిజయం సాధించసాగాయి. తెలుగు ప్రజల తెలుగు వాడకం కూడా బాగా పరిణితి చెందింది. వారిలో భూత దయకంటే బూతు దయ బాగా పెరిగింది.

ఇద్దరు పలుకరించుకుంటే అప్పుడు 'నమస్కారం' అనుకునేవారు. యిప్పుడెందరో ప్రేక్షకాభిమానులై 'నీ యమ్మస్కారం' అనుకోసాగారు. 'మరింకేం చెప్పొద్దు'కి బదులు 'మూసుకో' అని మొదలెట్టారు. బూతు బ్రదర్స్ ఎఫెక్టుకి తెలుగు సినిమా తెలుగును విమర్శించే వుద్దండ తెలుగుపండితులు కూడా ప్రభావితులై. 'నీయమ్మ! ఏం తెలుగయ్యా యిది? బొక్కలో తెలుగు' - అనే స్థితికి స్థిరపడ్డారు.

అయితే నేనిప్పుడు చెప్పేది చిత్రలోలుడు, చిత్రకాముడు అనే బూతు బ్రదర్స్ సినిమాల కథకాదు. వారి చిత్రాల విజయాలకు దోహదించే హీరో కథ.

అవాళ తమ కొత్త చిత్రం సబ్జక్టు సానబట్టడం కోసం వారి బాక్సాఫీసు హీరో యింటికి వచ్చారు.

ఆ హీరో యెవరో కాదు. ప్రఖ్యాత నటుడు 'తూతూబాకా'. అసలు పేరు మొదట్లో వీర వెంకట సత్తిపండు. అయితే అతడు హీరోగా నటించిన తొలిచిత్రం తూతూబాకా హిట్టవడంతో తూతుబాకా సత్తిపండు, తూతూబాకా అనే పేరుతో ప్రేక్షక హృదయాల్లో పేరుకుపోయాడు.

నిర్మాత జంట బ్రూబ్రదర్స్ ఎంట్రీ టైముకి తూతూబాకా శివుడిలా కూర్చుని సాయంకాలకూటంతో కంఠాన్ని తడుపుకుంటున్నాడు.

'ఏవిటీ - అప్పుడే గ్లాసట్టుకున్నారా!' అన్నారు బ్రూబ్రదర్స్.

'అవును - సీసాకి మూత అడ్డం వొస్తోంది. అంచేత గ్లాసేక్లాసు'

'బాగానేవుంది' అంటూ బ్రూబ్రదర్స్ కూడా వారి ట్రెండుకి సరిపోయేలా బ్లూ వొడ్డించుకున్నారు.

'సరే మరి కథ డిస్కస్ చేద్దావా!' అన్నారు.

'ఏ కథ? నా కథా? మీకథా?' అడిగాడు తూతూబాకా.

'మీ దగ్గరో కథుందేటి?'

'వుంది'

'అయితే చెప్పండి. అదే విందాం.'

'వినండి. కానీ యిది సినిమా కథకాదు. నా కథ. అంటే నా కథ. నా యొక్క కథ.'

'ఓ.కే. గో ఆన్'

'నేను ఆల్రెడీ ఆన్.'

'అందుకేనేవిటి? గ్లాసు వదిలేసి యిప్పుడు సీసా పట్టుకున్నారు.'

'సీసా మూతెక్కడో పడిపోయింది. ఒకవేళ దొరికినా అది గ్లాసుకి పట్టదు. మూతలేని సీసా ముగింపులేని సినిమాలాంటిది. సీసా ఖాళీ చేస్తే అది మూతని కేర్ చెయ్యక్కర్లేదు.'

'మూడ్‌లో మూత కూడా తాగేసివుంటారు. ముందింకో మందు భాండం తియ్యండి. తీసి మీకథ మొదలెట్టండి.'

'మొలదెటతాను నా కథ మొలదెటతాను.'

'పెట్టవయ్యా మగడా!'

'నా కథ - అంటే నా స్టోరీ చాలా సింపుల్ - నేను వందేళ్లు బతకాలి. వొందేళ్లూ హీరో వేషమ్మే వెయ్యాలి.'

'తప్పకుండా! మా వందల చిత్రాల్లో హీరోగా నటించి అశేష ఆంధ్రప్రేక్షకలోకాన్ని వురూతలూగిస్తున్నారు. వారి అభిమానం మీకు వందేళ్లకుమించే ఆయుష్షు పోస్తుంది. మీ వందో ఏట కూడా మీరు హీరో వేషమే వేస్తారు. 'అమ్మా! నేను బి.ఏ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యానమ్మా! పాసయ్యాను' అంటూ డైలాగు చెబుతారు. ఏ వర్రీలు వొద్దు. మీకు మేమున్నాం. మీరు మా హీరోకాకా ప్రేక్షకుల గుండెల్లో తూతూబాకా. హాయిగా పెగ్గుమీద పెగ్గేసుకుని, విగ్గుమీద విగ్గు తగిలించుకుని నిశ్చింతగా వుండండి.'

"మీ పోరోత్‌సావం సేనా బేషుగ్గా వుంది. కానీ వొందో బరత్‌డే తరాత నేను కాలేజీ కుర్రోడి రోలేస్తే యెదవ పెజలు యగ్గిరీ అవుతారా. అని నాకు డౌటు."

"అయ్యా బాకాగారూ! మీకా బెంగక్కర్లేదు.

మాంఛి ఫారిన్ విగ్గులొచ్చేస్తున్నాయి. రజనీకాంత్‌ని శ్రీరాముడిగా నప్పించేలా మేకప్ కళ బాగా అడ్వాన్స్ అయింది, డిజిటల్ యుగం వొచ్చేసింది. మిమ్మల్ని ఏకీలు కా కీలు విడదీసి మన్మధ కువారుడిలా మలిచేస్తాం. హీరోయిన్ తొడలు క్లోజప్‌లో చూసి, వున్న పొలాలన్నీ అమ్ముకుని సినిమా తీసి బేవార్సులయినట్టు, మీ డిజిటల్ అందం చూసి మతిపోయి పరికిణీలు వదిలేసిన పరికిణీ పిల్లలంతా మీకోసం మనసులు పారేసుకుని వాట్సప్పులో వెతుక్కుంటారు-" అని బ్రూబ్రదర్స్, తూతూబాకాకి బాగా ధైర్యప్రోత్సాహాలిచ్చారు.

అంతా బాగానే వుంది బెదర్సూ! అయితే నాకొక్కటే బెదురు. వందేళ్లదాకా ఏ జబ్బూలేకుండా, మీదపడే వయసు కప్పేసుకున్నా మిరకిల్‌మాన్‌లా దారుడ్డెంగా వుండాలి కదా? అదీ నా కొచ్చిను.'

'కొచ్చినూలేదు, కోస్తాలేదు. మా మాటవినండి. చార్‌మినార్ దగ్గర మాకు తెలిసిన డాక్టరు ఒకడున్నాడు. పేరు యవ్వనప్రసాద్. డాక్టరు యవ్వన ప్రసాద్ యెవ్వరికైనా యవ్వన బలం యివ్వగలడు. ఆ మాటకొస్తే మన యిండస్ట్రీలో అతి ముసలి నిర్మాతలక్కూడా ఆ డాక్టర్ వైద్యానికి, కొత్తగా ఫీల్డులో కొచ్చిన కొత్తిమీర కాడల్లాంటి వుత్తర కొత్త హీరోయిన్లను చూడగానే వొళ్లంతా టివటివలాడుతోంది. అంచేత వెంటనే డాక్టర్ యవ్వనప్రసాద్‌ని యిక్కడికి పిలిపించి మీ సమస్య సాల్వు చేసేస్తాం' అని హామీ యిచ్చి, బ్రూబదర్స్ వెంటనే తూతూబాకా ట్రీట్‌మెంట్‌కి డాక్టర్ యవ్వనప్రసాద్‌ని రప్పించారు.

'ఏవిటి మీ ప్రాబ్లమ్ బాకాజీ' అనడిగాడు డాక్టర్.

'ఏవీలేదు. నాకు స్లోగా వయసుమీద పడుతోంది. పడుతోందిగానీ పడిలేవట్లేదు. నాకు హీరోబలంతో వందేళ్లు స్ట్రాంగ్‌గా బతకాలనుంది.' చెప్పాడు బాకా.

'ఓస్! యిదా ప్రాబ్లమ్. ట్రీట్‌మెంట్ చాలా సింపుల్. మీకింకా పెళ్లి కాలేదుగా - వెంటనే పెళ్లి చేసేసుకోండి. ప్రాబ్లమ్ సాల్వుడూ.'

'పెళ్లి చేసుకుంటే వందేళ్లూ వీర హెల్తేనా!'

'డెఫినిట్లీ - పెళ్లయిన వెంటనే మీ మనసులోంచి యీ ఆలోచన యెగిరిపోతుంది. పెళ్లి తర్వాత వందకాదు పదికాదు, వొక్క యేడాదికూడా బ్రతకాలనిపించదు.'

'ఏడిసినట్టే వుంది. మీ సలహా సంతకెళ్లా - నేనసలు పెళ్లే చేసుకోను. యింకో ట్రీట్‌మెంట్ యివ్వండి.'

'ఆల్‌రైట్. వుంది. ఆల్టర్నేట్‌గా అద్భుతమైన ట్రీట్‌మెంట్.'

'ఏవిటది? టేబ్లెట్సా? యింజెక్షనా? ఆపరేషనా?'

'అవేవీకాదు. ముందు మీ పెర్సనల్ హిస్టరీ చెప్పండి. మీరు మందుకొడతారా?'

'కొట్టను. తాగుతాను.'

'మీరు పొగ తాగుతారా?'

'తాగను. పీలుస్తాను.'

'యింకా ఏం చేస్తారు - ఐమీన్, ఎపార్ట్‌ఫ్రం యాక్టింగ్'

'షూటింగయ్యాక రాత్రిళ్లు. నాకు నచ్చిన హీరోయిన్స్‌తో ఝునక్ ఝునక్ పాయల్ బాజే సాధన చేస్తాను.'

'అయితే సీరియస్‌గా వినండి. ఈ మూడూ - స్మోకింగు, డ్రింకింగు, ఝునక్ ఝునక్ పూర్తిగా మానెయ్యండి. యింకేరకం చికిత్సలూ అవసరం లేకుండా హాయిగా వందేళ్లు హెల్దీగా లాగేస్తారు.' అని సలహాయిచ్చి నిష్క్రమించాడు డాక్టర్ యవ్వనప్రసాద్.

రెండ్రోజుల తర్వాత బ్రూబదర్స్, హీరో తూతూబాకాని కలిసి - 'సో. అంతా ఓకె యిప్పుడు. మరి మన నెక్స్ట్ పిక్చరు మొదలెట్టేద్దాం.' అన్నారు.

'సారీ, బెదర్స్! నేనొక నిర్ణయానికొచ్చాను. ఇంక నేను సినిమాల్లో నటించబోవటంలేదు. డిసైడెడ్ టు స్టాప్ యాక్టింగ్'

- ఈ సమాధానం హీరోబాకానుండి వినగానే బ్రూబదర్స్ - చిత్రలోలుడు, విచిత్రకాముడు షాక్ అయిపోయారు. 'ఎందుకిలా డిసైడయ్యారు?' అని తూతూబాకాని నీళ్లు నములుతూ అడిగారు.

- అదీ విషయం విక్రమార్కా? "ఇప్పుడు చెప్పు! నిర్మాతలు అడిగిన సందేహానికి హీరో బాకాయే రొప్లై యిచ్చాడు! అసలు తూతూబాకా యెందుకలా చిత్రసీమనుంచి అర్జంటు రిటైర్‌మెంట్ ప్రకటించాడు? నా యీ ప్రశ్నలకు నువ్వు తెలిసీ బదులు చెప్పక పోయావో, నీ తల వెయ్యి చెక్కలయి చిందరవందరైపోతుంది-" అని బేతాళుడు ముగించాడు.

అప్పుడు విక్రమార్కుడు, "ఓ బేతాళా! నిర్మాతలైన బూబదర్స్‌కి హీరో తూతూ యిచ్చిన బాకా సమాధానం యిది - 'బెదర్సూ! డాక్టర్ చెప్పినట్టే సిగరెట్లు, మందు, ఝునక్ ఝునక్ మానేశాను. మానెయ్యగానే యెప్పటిదాకానో యెందుకు! ఇప్పుడే వందేళ్ల వృద్ధుడిలా అయిపోయాను. హీరో చేవచచ్చి జీరో శక్తి వచ్చింది. ఎందుకూ పనికిరాని యెదవనయిపోయాననిపిస్తోంది. గడిచే ప్రతిరోజూ వందేళ్లనిపిస్తోంది. జవంలేని జీవం సెకనైనా శతాబ్దమైనా వొకటే, వోపిక లేని నటనతో నా ప్రేక్షక బంధువుల్ని హింసించలేను. అందుకే యిక సినిమాలు చెయ్యను -'

తస్మాన్నా ర్హా వయం హన్తుం
ధార్తరాష్ట్రాన్ సబాంధవాన్!
స్వజనం హి కథం హత్వా
సుఖిన శ్యామ మాధవ! ||

ప్రేక్షక బంధుహింస దుఃఖదాయకమేగాని ప్రీతికరముకాదు. నీ టాలెంటును పంచుకొనువారు లేక ఎట్లు ఆనంద జీవితము గడుపగలము? అని అర్జునుడు అడిగాడని - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు" అని చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి బతుకుతో అతకని బేతాళుడు యెగిరి మళ్లీ చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments